క్లుప్తంగా

కఠెవరంలో ఆషాడ బోనాలు



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం బీసీ కాలనీలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం మహిళలు ఆషాడ బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు జూజుల వెంకటేశ్వరరావు, మణికంతవర్మ, బాబి, జగదీష్ పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి పెండ్యాల వెంకట ఉమామహేశ్వరావు, రామ్‌దేవ్, సురేష్‌లు సహాయం అందజేశారు. మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

రేపు ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ



తెనాలిఅర్బన్: అర్హత ఉన్న సినీ పరిశ్రమ కార్మికులందరికి ఆదివారం ఈ-శ్రమ్ కార్డులను తెనాలిలో కార్మికశాఖ అధికారులు పంపిణీ చేయనున్నట్లు సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్డుల వల్ల కార్మికులందరికి ఇన్సూరెన్స్ సదుపాయం ఏర్పడనుందని చెప్పారు. తెనాలి సుల్తానాబాద్‌లోని రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్మిక శాఖ జిల్లా ఉప కమిషనర్ ధూళ్ళిపూడి వెంకట శివప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో మిలటరీ ప్రసాద్, అమీర్ చౌదరి, దాసరి శివన్నారాయణ పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ ఏర్పాటు

తెనాలిఅర్బన్: తెనాలి బస్టాండ్ ఆవరణలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డీపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. నెలకు రూ.1.65 లక్షలకు స్థలాన్ని హెచ్‌పీసీఎల్ సంస్థకు లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. 15 సంవత్సరాల పాటు లీజు గడువు ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెనాలి బస్టాండ్ ఆవరణలో హెచ్‌పీసీఎల్ సంస్థ వారు ఏర్పాటు చేస్తున్న పెట్రోల్‌బంక్‌ను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

సమష్టికృషితో కుష్ఠువ్యాధిని నిర్మూలిద్దాం

డాక్టర్ వేముల ప్రియాంక

మున్నంగి(కొల్లిపర): చేయి చేయికలుపుదాం కుష్ఠువ్యాధిని సమూలంగా నిర్మూలిద్దాం అని మున్నంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధి పై ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో, మశూచి నిదేశంలో ఏవిధంగా నిర్మూలించాము అదే విధంగా ఇప్పుడు ప్రజల సహకారంతో కుష్ఠువ్యాధిని కూడా నిర్మూలించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. ప్రతి ఒక్కరు తమ చర్మం పై రాగివర్ణం కలిగిన మచ్చ ఉండి అక్కడ స్పర్శ లే కుండా ప్రాథమికంగా కుష్ఠువ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకుని వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రందించాలని సూచించారు. ఈ వ్యాధిపై సమాజంలో అవగాహన పెంచడానికి జూన్ 26 నుంచి జులై 16 వరకు ప్రతి గ్రామంలోని ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి రాగివర్ణం కలిగిన మచ్చలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకోవాని తెలిపారు. అవగాహనతోపాటు ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సమాజ ఆరోగ్యఅధికారిణి దాసర స్వరూపరాణి, పీహెచ్ఎన్ కోటేశ్వరి, ఆరోగ్యవిస్తరణాధికారి వంగర బుజ్జిబాబు, హెల్త్ అసిస్టెంట్ గంగవరపు శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీ మద్భాగవత పారాయణ

పాతగుంటూరు: సంపత్‌నగర్‌లోని శృంగేరి శంకరమఠం శారదా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 25 నుంచి జులై 2వ తేదీ వరకు 108వ శ్రీమద్భాగవత పారాయణ పూ ర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్స వం నిర్వహిస్తున్నట్లు విష్ణుభట్ల ఆంజనేయులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న ఉద యం 6 గంటలకు గురువందనం, విఘ్నేశ్వ రపూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశస్థాపనం, అఖండ దీ పారాధన, శ్రీ మద్భాగవత మహత్యా పారాయ ణ ప్రారంభం, 26 నుంచి జులై 2 వరకు ఉదయం 7 గంటలకు పారాయణ ప్రారంభం, మ ద్భాగవత మహాపురాణ ప్రవచనం, భాగవత పారాయణం, భాగవత ప్రవచనం, తీర్థ ప్రసా ద వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- అద్దె ఇంటి నుంచి సొంతింటికి
- 58 శాతానికి పైగా నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు
- మండలంలో జగనన్న కాలనీల్లో 2409 మందికి ఇళ్ల పట్టాలు.. గృహాలు మంజూరు
- ఉత్సాహంగా గృహ ప్రవేశాలు చేసుకుంటున్న వైనం




వల్లభాపురంలోని జగనన్న లేఅవుట్

కొల్లిపర: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌సాకారం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సొంత గూడుకు నోచుకోక అద్దె ఇళ్లలో ఉంటున్న పేదవారికి ప్రతి గ్రామంలో ప్రభుత్వ మే భూమి కొనుగోలు చేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేసి వాటిలో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేయటమే కాకుండా గృహాలను నిర్మించి ఇచ్చి సొంత ఆస్తిని కల్పించారు. ప్రాణం పోయే లోగా సొంతింటి కల సాకారమవుతుందా... సొంతంగా ఇళ్లు కట్టుకోగలమా అనే పేదల సందేహాలను పటాపంచలు చేస్తూ సొంతింటి కలను నెరవేర్చడంపై కొల్లిపర మండలంలోని అనేక గ్రామాలలోని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవరత్నాల్లో భాగంగా ...

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గూడు కల్పించాలనే ఉద్దేశంతో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. అందులో మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. గృహాలను మంజూరు చేశారు. పేదలకు ఉచితంగా నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా కొల్లిపర మండలంలోని 20 గ్రామాల్లో సొంత ఇళ్లు లేని 2409 మంది లబ్ధిదారులను గుర్తించి జగనన్న కాలనీ లేఅవుట్‌లో సీఎం జగనన్న సహకారంతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు అందజేశారు. గృహాల నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. సొంతంగా నిర్మించుకోలేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 754 ఇళ్లను పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. అద్దె ఇంటి నుంచి సొంతింటికి మారి సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నారు.



ప్రాణంపోయేలోగానైనా...

ఎన్ని ప్రభుత్వాలు మారినా సొంతింటి కలకు నోచుకోక కొందరు అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. మరి కొందరు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో తమ ప్రాణాలు పోయేలోగానైనా సొంతింటి కల నెరవేరు తుందా...లేదా అనే అనుమానం ఉండేది. సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నవరత్నాల్లో భాగంగా అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేయాలని సంకల్పించి జగనన్న లేఅవుట్లును సిద్ధం చేశారు. అందులో నివేశన స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లను నిర్మించి ఇచ్చి సొంత ఆస్తిని కల్పించారు. దీంతో చివరి దశలో సొంతగూడు లభించిందని వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన సీఎం వైఎస్ జగన్‌ను తమ మనుమడిగా, యువత అన్నగా చూసుకుంటూ మురిసిపోతున్నారు.

58 శాతం మేరకు నిర్మాణాలు

కొల్లిపర మండలంలో వివిధ గ్రామాల్లో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్, బిల్లులు పెండింగ్‌లో లేకుండా అందిస్తున్నాం. 58 శాతం మేరకు నిర్మాణాలు జరిగాయి. మిగిలిన వాటిని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకున్నాం

– బి.సుబ్బారావు, హౌసింగ్ ఏఈ

ఆర్థిక సహకారం.....

ఇంటి స్థలం పట్టాలు పొందిన పేదలకు గృహ నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని తక్కువ ధరకు అందజేయడంతో పాటు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల నిధులను ప్రభుత్వం అందజేస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అదనంగా బ్యాంకు రుణం కింద రూ.35,000 చొప్పున మంజూరు చేయడంతో ఉత్సాహంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు.

జగనన్న మేలు మరువలేనిది



ఎన్నో ఏళ్లగా సొంత స్థలం, ఇల్లు లేక గ్రామంలోని చెరువు కట్టపై భర్త , పిల్లలతో నివాసం ఉంటున్నాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. అర్హత కలిగిన నాకు ప్రభుత్వం సెంటున్నర స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణ పథకం మంజూరు చేయడంతో ఇంటిని పూర్తి చేసుకున్నా. దీంతో ప్రస్తుతం నా ఇంటి విలువ రూ.12లక్షల పైగా చేస్తుంది. నా సొంతి కల నేరవేర్చిన జగనన్నను ఎప్పటికి మరువలేను.

– కటారి వెంకట నరసమ్మ , కొల్లిపర

జగనన్న పుణ్యమే



ఈ ఫొటోలోని ఆమె పేరు వల్లబాపురం తేరేజమ్మ ఈమెకు భర్త లేరు, కుమార్తెలు వివాహాలు చేసుకుని వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. ఈమెకు సొంతిల్లు లేకపోవడంతో మరొకరి పంచన ఉంటోంది. గత 20 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవ రత్నాలు పథకంలో పేదలకు ఇల్లు కార్యక్రంలో గ్రామానికి వచ్చిన అధికారులకు ఇంటి కోసం వినతిపత్రం ఇవ్వగా , వెంటనే ఎటువంటి రెకమండేషన్ లేకుండా వెంటనే జగనన్న కాలనీలో నివేశన స్థలం మంజూరు చేశారు. ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇప్పుడు తన సొంతింటిలో దర్జాగా బతుకుతున్నానని, మరొకరిపై ఆధార పడకుండా జీవనం సాగిస్తున్నాని గర్వంగా చెబులతోంది తేరేజమ్మ , ప్రాణం పోయేలోపైనా ఇల్లు వస్తుందా..రాదా అని ఎదునేచూసిన తనకు సొంతిల్లు తన అన్న జగన్ పుణ్యమేని సంతోషం వ్యక్తం చేస్తోంది.

– వల్లబాపురం తేరేజమ్మ , వల్లభాపురం

అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డాం



ఈ ఫొటోలోని మహిళ పేరు షేక్ నూర్జహాన్ , టైలరింగ్ చేస్తూ జీవనం సాగిసోంది. ఈమెకు సొంతిల్లు లేదు. గత 22 ఏళ్లుగా అద్దె గృహంలో ఉంటోంది. గతంలో పలుమార్లు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నా సొంతింటి కల నెరవేరలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ నిర్మించి నివేశన స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం రూ. 1.80 ఇల్లు నిర్మాణానికి ఇవ్వగా మరి కొంత మీము సమకూర్చుకుని ఇళ్లు నిర్మించుకున్నామం. జగనన్న సొంతింటి ఆస్తిని కల్పించడంతో అద్దె ఇంట్లో పడిన ఇబ్బందులను మరిచిపోయానని నూర్జహాన్ సంతోషంగా చెబుతోంది. ఎన్నో ఏళ్ల సొంతింటి కలను నెరవేర్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

– షేక్ నూర్జహాన్ , వల్లభాపురం

ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ



నాయుడమ్మకు నివాళి అర్పించి పంపిణీ చేసిన పుస్తకాలతో అతిథులు

తెనాలి: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సామాన్య ప్రజలకు ఉపయోగపడాలన్న ధ్యేయంతో జీవిత కాలం పనిచేసిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్ఫూర్తిగా నేటితరం శాస్త్రవిజ్ఞానంపై అభిరుచిని పెంచుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. డాక్టర్ నాయుడమ్మ 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సంస్థ ఆవరణలో జరిగిన సభలో 'పీపుల్స్ సైంటిస్ట్' పుస్తకాన్ని కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యడ్లపాటి స్వరూపరాణి, యలవర్తి పవన్‌కుమార్, యడ్లపాటి రఘురాం, అడుసుమల్లి సుధాకర్, వెలగా రమేష్‌బాబు, కఠారి వాసుదేవనాయుడు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు మాట్లాడారు. శాస్త్రరంగానికి నాయుడమ్మ సేవలను స్మరించుకున్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



బదిలీపై వెళ్లిన షబానా తబస్సుం సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొల్లిపర: మండల పరిధిలోని పిడపర్రు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉర్దూలో గత పది సంవత్సరాల నుంచి ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయురాలు షబానా తబస్సుంను శుక్రవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభ అధ్యక్షుడు బెన్ హర్ మాస్టారు , ప్రధానోపాధ్యాయురాలు జరీనా మాట్లాడుతూ షబానా పాఠశాలలో చదువుతోపాటు పాఠశాల అభివృద్ధికి అనేక సేవలు చేస్తూ పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు ఆమెను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ రాము, సీఆర్‌పి మురళి విద్యార్థులు పాల్గొన్నారు.

22-ఎ నిషేధిత భూముల్లో పూర్తయిన సర్వే

- గ్రామకంఠంను వేరుచేసే ప్రక్రియలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖలు
- 991 నివాసాలు ఉన్నట్లు గుర్తింపు
- రెగ్యులైజేషన్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు



పాత రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ డీసీపీ మహాలక్ష్మి దొర తదితరులు

తాడేపల్లిరూరల్: నిషేధిత జాబితాలోని భూములపై రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వే ప్రక్రియ పూర్తికాగా శుక్రవారం రికార్డులను పరిశీలించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 201లో పలువురు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. 2014లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతాన్ని నిషేధిత 22-ఎ జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల చుట్టూ ప్రజలు తిరుగుతూనే ఉన్నారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఎట్టకేటకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో గ్రామ కంఠాన్ని నిషేధిత జాబితా నుంచి విడదీసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. శుక్రవారం తాడేపల్లిలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ డీసీపీ మహాలక్ష్మి దొర ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాత రికార్డుల ప్రకారం వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన సర్వే నంబర్ 201లో ఉన్న 159 ఎకరాల భూమిని సర్వే చేశామని, మొత్తం 991 పక్కా నివాసాలు నిర్మించుకుని జీవిస్తున్నారని, పాత రికార్డుల ప్రకారం గ్రామ కంఠం ఎక్కడ దాకా ఉందో పరిశీలించి తుది జాబితా జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని, ఇప్పటి వరకు సర్వే చేసిన భూములన్నీ కూడా గ్రామ కంఠంలోనే ఉన్నాయని, అక్కడక్కడా కొంత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించామని, త్వరలోనే తాడేపల్లి పట్టణ పరిధిలో 2014 ముందు గ్రామ కంఠంలో ఏ విధంగా అయితే రిజిస్ట్రేషన్లు అయ్యాయో అదే విధంగా రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, సర్వేయర్ శ్రీరంగమోహన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్

సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జడ్జి విక్టర్ ఇమ్మానుయేల్



మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి విక్టర్ ఇమ్మానుయేల్, వేదికపై,మురళీకృష్ణ యాదవ్

తెనాలిటౌన్: విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలో విద్యుత్ లోక్ అదాలత్ అవగాహన సదస్సులు ఏర్పాటుకు చర్యలు తీసకుంటున్నట్లు సిజిఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జిల్లా జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. తెనాలి చెంచుపేటలోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం విద్యుత్ వినియోగదారులు అదాలత్‌కు నిర్వహించారు. అదాలత్‌లో వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో విశ్రాంత జిల్లా జడ్జి విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ గతంలో తిరుపతిలో విద్యుత్ అదాలత్‌ను నిర్వహించేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకాశం, గుంటూరు, కృష్ణా పాత జిల్లాలకు కలిపి విజయవాడ గుణదలలో అదాలత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారులకు అన్యాయం జరిగితే న్యాయం చేస్తామని, తప్పుడు సమాచారం మాత్రం వినియోగదారులు ఇవ్వవద్దని కోరారు. గ్రామాల్లోని రాజకీయ కక్షలు, కుటుంబ తగాదాలు ఉన్న సమస్యలను అర్జీలు ఇవ్వవద్దన్నారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా తమ పరిధిలో ఉన్నంత వరకు సహాయం చేస్తామన్నారు. పట్టణంలోని డి-1 పరిధిలో బిల్లింగ్ రీడింగ్ పొరపాటు జరిగిన వినియోగదారునికి రూ.42 వేలకు గాను రూ.32 వేలు తగ్గించారు. దీనికి వినియోగదారుడు అనిరుధ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. యడ్లపల్లి లైన్‌మెన్ సక్రమంగా పనిచేయడం లేదని వినియోగదారుడు కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. మరో అయిదు ఫిర్యాదులు అందాయి. అదాలత్ జిల్లా ఎస్.ఇ.మురళీకృష్ణయాదవ్, తెనాలి ఈఈ వివి.చిరంజీవి, డీఈలు అశోక్ కుమార్, భాస్కరరావు, అదాలత్ సాంకేతిక సభ్యులు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు రామ్‌దాస్, డివిజన్ పరిధిలోని ఏఈలు, ఏఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో ఐరన్ దిమ్మెలు తరలింపు

- నిందితులు పరారు
- పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్



పోలీసులు సీజ్ చేసిన ఆటో ఇదే

తాడేపల్లిరూరల్: ఐరన్ దిమ్మెలను తరలిస్తున్న ఆటోను తాడేపల్లి పోలీసులు శుక్రవారం సీజ్ చేయగా నిందితులు పరారయ్యారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ ఆటో తాడేపల్లి పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు ఆటో వద్దకు వెళ్లారు. ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. ఆటో నడుపుతున్న వ్యక్తిని పట్టుకుని పరిశీలించగా పెద్ద పెద్ద ఐరన్ దిమ్మెలు కనిపించాయి. ఆటోను, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తమదైన శైలిలో విచారించగా, రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న ఐరన్ దిమ్మెలు దొంగిలించి విజయవాడలో అమ్మేందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. పట్టుబడ్డ యువకుడు విజయవాడకు చెందిన కిషోర్‌గా గుర్తించామని, పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలంటూ ధర్నా

మంగళగిరి: ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా సంబంధిత అధికార యంత్రాంగం చోద్యం చూడటం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గ పరిధిలోని నిర్మలా హైస్కూల్, నారాయణ, డాన్‌బాస్కో, చైతన్య టెక్నో స్కూల్స్‌పై నామమాత్రపు చర్యలు తీసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జీఓ నెంబరు 1 ప్రకారం ఫీజులకు సంబంధించిన ధరలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని, పాఠ్య పుస్తకాలకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ గోపి, కో కన్వీనర్ అభిషేక్, బియశ్వంత్ పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని వినతి



తెనాలిఅర్బన్: గుంటూరు కార్పొరేషన్ అతిథి గృహం ముందు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే సావిత్రీ భాయి పూలే కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు కోరారు. ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గతంలో వినతిపత్రం ఇచ్చినట్లు గుర్తు చేశారు. పూలే విగ్రహం పక్కనే ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.

యువతలో చైతన్యం తీసుకురావాలి



తెనాలిఅర్బన్: విదేశీ విష సాంస్కృతి ప్రసార మాధ్యమాల ద్వారా యువతను, సామాజాన్ని పాడు చేస్తోందని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కళాకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి కళాకారులు కళా రూపాలు ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27 నుంచి 30 వరకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సాంస్కృతిక సమ్మేళనంలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, నాయకులు బెల్లంకొండ వెంకట్, శ్రీదేవి, అనురాధ, రత్తాలు, నీలాంబరం, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆక్రమణలను పోలీసులు తొలగించారు. రోడ్డులో వ్యాపారాలు చేస్తున్న వారు సీసీ రోడ్డును ఆక్రమించి ఉంచడాన్ని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డుపై వ్యాపారాలు తొలగించలని వ్యాపారస్తులకు సూచించారు. త్వరలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగిస్తామని సీఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై ఎస్ఈబీ అధికారుల దాడులు

తాడికొండ: పేకాట స్థావరాలపై గుంటూరు ఎస్ఈబీ అధికారులు దాడిచేసి 12 మందిని అరెస్టు చేసిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. మండలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు నిడుముక్కల కొండల ప్రాంతంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 మంది పేకాట రాయుళ్లు, రూ.2,23,540 నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని తాడికొండ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఇస్త్రి బండి అందజేత

మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో నవులూరుకు చెందిన రాచకొండ రాముకి స్థానిక పార్టీ నేతలు శుక్రవారం ఇస్త్రీ బండిని అందజేశారు. కార్యక్రమంలో దొడ్డక కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని అజయ్‌నగర్‌కు చెందిన గజంరాజు- అమీన అనే వృద్ధ దంపతులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు. కొప్పురావుకాలనీకి చెందిన పొలనం నందకుమార్‌కు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, అనుబంధ సంఘాల నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

మంగళగిరి: పుస్తకాలు, యూనిఫాం పేరుతో నిలువుదోపిడీ చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు శుక్రవారం ఎంఈఓ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి మున్నా మాట్లాడుతూ నగరంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారాయన్నారు. అధిక ఫీజులతో బాధపడుతున్న తల్లిదండ్రులకు అదనంగా పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూ అని అదనపు భారం మోపుతున్నారని మండిపడ్డారు.